



వివాహ రిసెప్షన్‌లో మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేంద్రారెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. కర్నూలు నగర శివార్లలోని జిఆర్‌సి కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన రిసెప్షన్‌లో పాల్గొని వదూవరులు డాక్టర్ కె.చతుర, డాక్టర్ నిఖిల్‌కు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. జగన్‌ను చూసేందుకు కార్యకర్తలు ఎగబడ్డారు. వివాహ రిసెప్షన్‌లో జగన్‌తో పాటు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే విరూపాక్షి, జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు మేయర్ బివై రామయ్య, మాజీ పిసిసి అధ్యక్షులు సాకే శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, కాటసాని రామిరెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు బాబూరావు, తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈనెల తెలంగాణ రాష్ట్రం 14న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని సిరి వ్యాలీ రిసార్ట్స్‌లో వివాహం జరిగింది.

ఆగిన పనులు



- అర్థాంతరంగా ఆగిన జిజిహెచ్ భవన నిర్మాణం
- రూ.15 కోట్ల బిల్లులు పెండింగ్
- నిర్మాణాన్ని నిలిపేసిన కాంట్రాక్టర్
- స్పందించని జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ సర్వజన హాస్పిటల్‌లో ఆధునిక భవన నిర్మాణాలు ఆర్థాంతరంగా ఆగిపోయాయి. కాంట్రాక్టర్ కెఎంవి కంపెనీకి ఇప్పటిదాకా చేపట్టిన నిర్మాణాలకు సంబందించిన రూ.15కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీంతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులను నిలిపి వేసినట్లు సమాచారం. ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ ఆధునీకరణ పనులలో భాగంగా ఇన్‌పేషెంట్ విభాగం (ఐపిడిబ్లాక్), అవుట్ పేషెంట్ విభాగం (ఒపిడిబ్లాక్), క్యాజువాలిటీ , ఎమర్జెన్సీ, మెడికల్ కాలేజీ, హాస్పిటల్ క్యాంటిన్, లెక్చర్‌గ్యాలరీ, ఆధునిక మార్చురీ, బయోమెడికల్ వేస్ట్, సెక్యూరిటీ కోసం రూ.500 కోట్లతో ఆధునిక భవనాల నిర్మాణ పనులను కెఎంవి కంపెనీ చేపట్టింది. జులై 2025 నాటికి ఆధునిక భవనాల నిర్మాణం పూర్తి కావల్సివుంది. ఈ నిర్మాణ పనులు చాలా నెమ్మదిగా సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. సబ్ వే, గ్రౌండ్ ఫ్లోర్, నాలుగు అంతస్తుల భవనాలలో క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ, 668 బెడ్స్‌తో నిర్మాణం అవుతున్నాయి. ఈ భవనాల నిర్మాణాల బిల్లుల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశారు. అత్యవసర వైద్యం అందించే క్యాజువాటి, ఎమర్జెన్సీ , మేల్ మెడికల్, ఫిమేల్ మెడికల్, చాలా వార్డుల్లో రోగులకు చికిత్సను పాతబడిన భవనాలలోనే అందిస్తున్నారు. రాయలసీమకు తల మాణికమైన ఈ సర్వజన హాస్పిటల్‌లో కర్నూలు జిల్లాతో పాటు నంద్యాల, అనంతపురం జిల్లా నుండి , తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుండి వేలాది మంది రోగులు చికిత్స కోసం వస్తుంటారు. అలాంటి హాస్పిటల్ పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి త్వరగా నిర్మాణ పనులు పూర్తిచేసి రోగులకు ఆధునిక వసతులు కలిగిన భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు.



స్పందించని మంత్రులు , ఎమ్మెల్యేలు

జిజిహెచ్ భవననిర్మాణం నిలిపివేతపై ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు మంత్రులు స్పందించడం లేదు. ముగ్గురు మంత్రులున్నా ఇటీవల నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో హాస్పిటల్ నిర్మాణానికి తగిన నిధులు రాబట్టడంలో విఫలమయ్యారు. ప్రజలకు అత్యవసరమైన విద్య, వైద్యంపై మంత్రులు, ఎమ్మెల్యేలు శాసనసభలో పల్లెత్తు మాట మాట్లాడకపోవడం అన్యాయం. కనీసం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అయినా జిల్లాపై కనికరం చూపి నిధులు కేటాయించి ఆగిపోయిన జిల్లాహాస్పిటల్ భవన నిర్మాణాలకు నిధులు కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

నిధులు కేటాయించకపోవడం దారుణం

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతుంది. కర్నూలు జిల్లా కేంద్ర సర్వజన ఆస్పత్రిలో నూతన భవన నిర్మాణాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణం. దీనికి సంబంధిత మంత్రి, జిల్లా మంత్రులు ప్రజలకు సమాధానం చెప్పాలి. గత ప్రభుత్వంలో ఆస్పత్రుల నిర్మాణానికి నిధులు కేటాయించారు. కానీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించకుండా చోద్యం చూస్తుంది. ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను దగాచేస్తుంది. ప్రజలకు అత్యవసరమైన విద్య, వైద్యంను నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం తప్పదు. భవిష్యత్తులో ఇలాగే కొనసాగితే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నాం.

పనుల ప్రారంభానికి చర్యలు

- బివి.శివకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఎపిఎంఎస్ఐడిసి

నిర్మాణానికి కావల్సిన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధులు రాకానే పనులు ప్రారంభమవుతాయి. ఈలోపు కాంట్రాక్టర్‌తో కూడా మాట్లాడి హాస్పిటల్ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

నిర్మాణాలు నిలిపివేయడం సరికాదు

- జి.నగేష్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నూతనంగా నిర్మిస్తున్న నిర్మాణం పనులను నిలిపివేయడం సరైంది కాదు. రోజురోజుకు భారీగా పేషెంట్స్ పెరిగి ఒకబెడ్‌పైన ఇద్దరు ముగ్గురు ఉంటుంటే ఇలాంటి సందర్భంలో వేగంగా నిర్మాణ పనులు పూర్తిచేసి పేషెంట్లకు అందుబాటులోకి తీసుకురావాలి. నిర్మాణ పనులను నిలిపివేయడం అంటే పేద ప్రజల ఆరోగ్యాలను పణంగా పెట్టడమే. వెంటనే నిర్మాణ పనులను పూర్తి చేయాలి. లేదంటే ఆందోళనకు దిగాల్సి వస్తుంది.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాష

బ్యాంకర్లు సహకరించడం లేదు

- కలెక్టర్ పి.రంజిత్ బాష అసహనం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రైతులకు పంట రుణాలుతోపాటు పాటు సంక్షేమ పథకాలకు రుణాల అందజేయడంలో బ్యాంకర్లు సహకరించడం లేదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష బ్యాంకర్ల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. బుధవారం బ్యాంకర్లకు సంబంధించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరులో పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూకోబ్యాంక్, ధనలక్ష్మి బ్యాంక్, ఐడిబిఐ, కరూర్ వైశ్య బ్యాంక్, కో ఆపరేటివ్ బ్యాంక్‌లు వెనుకబడి ఉన్నాయన్నారు. పురోగతి సాధించాలని కలెక్టర్ సంబంధిత బ్యాంక్ అధికారులను ఆదేశించారు. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాల మంజూరుకు సంబంధించి 13500 దరఖాస్తులు బ్యాంకులకు ఇవ్వగా, అందులో 6544 దరఖాస్తులు మాత్రమే మంజూరయ్యాయన్నారు. విశ్వకర్మ యోజన పథకాలకు సంబంధించిన దరఖాస్తులను డిసెంబర్ 31వ తేదీ నాటికి పరిష్కరించాలన్నారు. జనవరి 15వ తేదీ లోపు పెండింగ్‌లో ఉన్న ముద్ర లోన్ దరఖాస్తులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లాకళ్యాణి, లీడ్‌డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్ర రావు, నాబార్డ్ డిడిఎం సుబ్బా రెడ్డి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ గిరిధర్‌బెహేర, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్, జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు, లీడ్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారంలోపు ఎంపిడిఒలపై చర్యలు

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధి హామీ పథకం అమలులో పురోగతి చాలా తక్కువగా ఉందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఉపాధి హామీ పనులుపై ఎంపిడిఒలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఖాళీగా ఉంచకూడదన్నారు. గత నాలుగు వారాల నుంచి చెప్తున్నప్పటికీ, ఇంకా ఆదోని, కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు, ఆలూరు, కృష్ణగిరి, దేవనకొండ, తుగ్గలి మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను ఖాళీగా ఉంచడంపై అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలు ఉపాధి కోసం ఎదురుచూస్తూ ఉంటే ఫీల్డ్ అసిస్టెంట్లు నియమించకుండా ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ఎంపిడిఒలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పోస్టులు ఖాళీగా ఉన్న మండలాల ఎంపిడిఒలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ అదనపు పిడిని ఆదేశించారు. వారంలోపు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించుకోకపోతే సంబంధిత ఎంపిడిఒలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, వెల్దుర్తి, ఓర్వకల్లు, కౌతాళం మండలాల్లో 60 శాతం కంటే తక్కువ శాతం కంటే తక్కువ ఎందుకు ఉందని కలెక్టర్ ఎంపిడిఒలను ప్రశ్నించారు. ఉపాధి హామీ పనుల కల్పనలో పురోగతిలో చివర్లో ఉన్న సాధించిన ఐదు మండలాల ఎంపిడిఒలను ప్రతి శనివారం పిలిపించి వివరణ అడుగుతామని కలెక్టర్ పేర్కొన్నారు. పంచాయతీ పనులకు సంబంధించి 830 పనులు మంజూరు కాగా అందులో 581 పనులు మాత్రమే పూర్తి అయ్యాయన్నారు. ఇందులో మంత్రాలయం, ఆలూరు, పెద్దకడుబూరు, కొసిగి, కౌతాళం, చిప్పగిరి, కోడుమూరు, ఆస్పరి మండలాల్లో పనుల్లో పురోగతి లేదని, పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎంపిడిఒలు, పంచాయతీ రాజ్ ఎఇలను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అదనపు ఎస్‌పి (అడ్మిన్) జి.హుస్సేన్ పీరా, జిల్లా పరిషత్ సిఇఒ నాసరరెడ్డి, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, పంచాయతీ రాజ్ ఎస్ఇ రామచంద్రారెడ్డి, గనుల శాఖ అధికారి రవిచంద్, డిపిఒ భాస్కర్, జలవనరుల శాఖ ఎస్ఇ బాలచంద్రారెడ్డి, అన్ని మండలాల ఎంపిడిఒలు, ఇఒఆర్‌డిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీలకు సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2011లో ఇచ్చిన జిఒ ప్రకారం గ్రామ పంచాయతీల్లో ఆస్తులకు సంబంధించి ఇన్వెన్టరీ రిజిష్టర్లు (ఎ,బి,సి) కచ్చితంగా నిర్వహించా ల్సి ఉందన్నారు. ఆ మేరకు రిజిష్టర్లు నిర్వహిస్తున్నారా లేదా అని డిఎల్ పిఒలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రిజిష్టర్లు నిర్వహిస్తున్నామని, అప్‌డేట్ చేయాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రెండు వారాల్లోపు రిజిష్టర్‌లను పూర్తి వివరాలతో అప్డేట్ చేయాలని డిఎల్‌పిఒలను ఆదేశించారు. పంచాయతీ ఆస్తులపై పంచాయతీ సెక్రటరీకి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు భూముల స్థితిగతులపై వెబ్ ల్యాండ్‌లో పరిశీలించుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో స్మశాన భూములు, ఇరిగేషన్ కెనాల్స్ కూడా ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టు కేసులు ఏవైనా ఉంటే సకాలంలో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డిపిఒ భాస్కర్ డిఆర్‌ఒ వెంకటనారాయణమ్మ ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఎంపిడిఒలతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాష



జర్నలిస్టుల పిల్లలకు విద్యలో రాయితీకి ఆమోదం

కలెక్టర్‌కు, డిఇఒకు ఎపిడబ్ల్యుజెఎఫ్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల పిల్లలకు ప్రవేట్, కార్పొరేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో 50 శాతం రాయితీని అందించడంపై ఎపిడబ్ల్యుజెఎఫ్ హర్షం వ్యక్తంచేసింది. బుధవారం ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు నాగేంద్ర, బసప్ప, సునీల్ కుమార్, వెంకటేష్ ,బ్రహ్మయ్య, వార్త స్టాఫ్ రిపోర్టర్ రవి ప్రకాష్, నాయకులు ఎర్రమల, నర్సిరెడ్డి, సుందర్ రాజు, సీనియర్ జర్నలిస్ట్ లు జమ్మన్న,మోహన్, వార్త డెస్క్ ఇంచార్జ్ మధు, డెస్క్ జర్నలిస్ట్‌లు రవి, రాజు లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషను, డిఇఒ శామ్యూల్‌పాల్‌ను కలిసి పూలమొక్కను అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్లవాగు దగ్గర అక్రమణకు గురయిన ఆర్‌అండ్‌బి రోడ్డు

ఆర్ అండ్ బి రోడ్డు ఆక్రమణ

రాకపోకలకు ఇబ్బంది - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి సి బెళగల్

సి బెళగల్ నుండి కర్నూలు కు వెళ్లే రోడ్డులో ఆర్లవాగు దగ్గర అక్రమణ యథేత్సగా జరుగుతోంది. ఇదే రోడ్డు గుండా కర్నూలు–ఎమ్మిగనూరు, బెంగుళూరు, మద్రాసు, చెన్నై, హైదరాబాద్, మరెన్నో నగరాలకు, పట్టణాలకు వాహనాలు వెళ్లాల్సి ఉంది. ఈ రోడ్డు 30 మీటర్లు వెడల్పు ఉండగా ఈ మధ్య గాజుల బ్రదర్స్ అనే భూ స్వాములు ఏకంగా 10 మీటర్లు ఆక్రమించి దుక్కులు దున్నేశారు. గాజుల వారి అక్రమణతో ప్రస్తుతం బిటి రోడ్డుకు కేవలం 20 మీటర్లు మాత్రమే ఉంది. అది కూడా రోడ్డులోను, ఇరు వైపులలోను గుంతలు గుంతలుగా ఉండటం వలన ఇరు ప్రక్కలకు మట్టి దారిలో వెళ్ళుటకు వీలుగా లేకుండా పోయింది. దీంతో వాహన దారులకు, భారీ వాహనాలకు, ఇతర చిన్న పాటి వాహనాలకు రాకపోకలు ఇబ్బందిగా మారింది. ఆర్‌అండ్ బి అధికారులు జిల్లా కేంద్రంలో ఉంటూ జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ రోడ్ల ఆక్రమణలపై నిద్రావస్థలో తూగుతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కనీసం అందుబాటులో ఉన్నటువంటి సిబ్బంది కూడా పట్టించుకోక పోవడం లేదు. ఆక్రమణ దారులకు అడ్డూ అదుపు లేకుండా పోయిందంటూ ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు చర్చించుకుంటున్నారు.

టెన్త్ పరీక్షలకు తర్ఫీదు

- -ప్రతి పాఠశాలలో ఉత్తీర్ణతే లక్ష్యం
- -వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- -నేడు హెచ్‌ఎం,ఎంఇఒలతో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్


ఈ విద్యా సంవత్సరం టెన్త్ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి రాయబోయే విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా విద్యాశాఖ కార్యాచరణ మొదలుపెట్టింది. జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరం టెన్త్ పరీక్షలను 37448 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ పరీక్షలకు సంబంధించిన సిలబస్ కూడా ఉపాధ్యాయులు పూర్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు గాను జిల్లా కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు ప్రత్యేక స్టడీఅవర్స్ నిర్వహించడం ఎప్పటికప్పుడు పరీక్షలను నిర్వహిస్తూ పర్యవేక్షణ చేస్తున్నారు. విద్యార్థులను మూడు రకాలుగా విభజించారు. టాప్ స్థాయిలోని విద్యార్థులు మధ్యరకంగా , పూర్తిస్థాయి వెనకబడిన విద్యార్థులకు విభజించారు. వీరందరికీ ప్రత్యేకంగా స్టడీ అవర్స్‌ను వివరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించడం పరీక్షలను పెట్టి సబ్జెక్టులో వెనుకంజులో ఉంటే వారికి మరింత శిక్షణ ఇవ్వడం చేస్తున్నారు. విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా విద్యాశాఖ అధికారి నుండి హెచ్‌ఎం వరకు పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ మేరకు టెన్త్ పరీక్షల పైన జిల్లా కలెక్టర్ గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒలతో విస్తృత స్థాయిసమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు.



గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహణ

వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం


ఎస్ శామ్యూల్ పాల్ డిఇఒ



ప్రస్తుత విద్యా సంవత్సరం టెన్త్ పరీక్షల్లో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నాం. అందుకు అనుకూలంగా కూడా కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు మెరుగైన ఫలితాలు ఈ విద్యా సంవత్సరం సాధించనున్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం.

విద్యార్థుల స్టడీ అవర్స్ నిరంతర పర్యవేక్షణ

వనజ కుమారి, ఎంఇఒ 2 కల్లూరు



టెన్త్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నాం. గత ఏడాది పబ్లిక్ పరీక్షల్లో పాఠశాల ఉత్తీర్ణత శాతం ఆధారం చేసుకొని ఈ సంవత్సరం 3 నెలల ముందునుండే సిలబస్ బోధన పూర్తి చేసాం. కొందరు విద్యార్థులను ప్రతీ ఉపాధ్యాయుడు దత్తత తీసుకొని వాళ్ళ హాజరు, రివిజను, పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించడం వంటివి దగ్గరుండి పరిశీలిస్తూ ప్రోత్సహిస్తున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక సాధన, చేయిస్తున్నాం.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

ప్రజాశక్తి- వెల్దుర్తి

ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి అంజిబాబు అన్నారు. వెల్దుర్తి సిపిఎం మండల సమావేశం ఎ.రాముడు ప్రాంగణంలో ఎన్.రాజు అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి.అంజిబాబు, నగేష్ మాట్లాడుతూ మండలంలో చెరువులన్నింటికీ వెంటనే నీళ్లునింపి సాగు, తాగునీరు అందించాలన్నారు. వెల్దుర్తి పట్టణానికి ప్రతిరోజు మంచినీళ్లు అందించాలని, మండలంలో సిసి రోడ్లు లేని కాలనీలకు రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల పైన జగన్ ప్రభుత్వం భారీగా భారాలు వేస్తుందని, తాము అధికారంలోకొస్తే నిత్యవసర వస్తువుల రేట్లు తగ్గిస్తామని, ట్రూ అప్ చార్జీలు వెయ్యబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రజల పైన ఒక్క రూపాయి కూడా నిత్యవసర వస్తువుల భారాన్ని తగ్గించలేదన్నారు. పైగా భారీగా పెరిగాయని, రూ12 వేల కోట్ల ట్రూ అప్ చార్జీలు ప్రజలపై భారం మోపారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్.రాజు ,కె.రాముడు, చిన్నయేసు, పెద్దఏసు, పాపారాయుడు, పెద్దన్న, బద్రి, వెంకట్ రాముడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తి సమావేశంలో మాట్లాడుతున్న ఎండి.అంజిబాబు, వేదికపై వై.నగేష్



వృద్ధులకు స్వెట్టర్లు , మంకీక్యాప్‌లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

చలికాలంలో జరభద్రం

-డాక్టర్ శంకర్‌శర్మ సూచనలు సలహాలు
-వృద్ధులకు స్వెట్టర్లు , మంకీక్యాప్‌లు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

చలి తీవ్రత నేపథ్యంలో వృద్ధులు,చిన్నపిల్లలు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ సూచించారు. కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్ శ్రీ గురుదత్త పాలి క్లినిక్‌లో చలి తీవ్రత నుంచి రక్షణ కోసం పేద వృద్ధులకు ఆయన స్వెట్టర్లు, మంకీ క్యాప్ లను బుధవారం పంపిణీ చేశారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో తన సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వృద్ధులకు స్వెటర్లు ,మంకీ క్యాప్ లను పంపిణీ చేశానని చెప్పారు. గతంలో చలి తీవ్రత నుంచి రక్షణ కోసం దుప్పట్లను పంపిణీ చేశామని, త్వరలోనే వాటిని కూడా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా చలి తీవ్రత దృష్ట్యా వృద్ధులు చిన్నపిల్లలు ఉదయం 10:30 గంటల తర్వాత బయటికి రావాలలన్నారు. అత్యవసరమైతేనే చలి నుంచి రక్షణ కోసం స్వెట్టర్లు, మంకీ క్యాపులు ధరించాలని సూచించారు. చలికాలంలో తెల్లవారుజామున గుండెపోటు వచ్చే అవకాశం ఉందని అన్నారు. చలి తీవ్రత నేపథ్యంలో చలి ప్రభావానికి గురయితే కొంతమందిలో రక్తనాళాలు సంకోచించి రక్త సరఫరా తగ్గిపోయి వేళ్ళు, కాలిభాగాలు నల్లగా మారే అవకాశం ఉందని తెలపారు. కొంతమందిలో గ్యాంగ్రిన్, వెరికోసిస్ వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. చలి ప్రభావానికి గురైతే కొంతమందిలో వారి చర్మం పూర్తిగా పొడి బారుతుందని, శరీరంపై గీరుకోవడం వల్ల శరీరంపై పుండ్లు ఏర్పడే అవకాశం ఉందని వివరించారు. చలికాలంలో మధుమేహ వ్యాధితో బాధపడే వారికి వివిధ రకాల సమస్యలు ఎదురవుతాయన్నారు. చలి తీవ్రత నేపథ్యంలో తాను తరచూ చేసే సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రస్తుతం వృద్ధులకు స్వెటర్లు, మంకీ క్యాప్ లు పంపిణీ చేశానని ,సమాజంలో ఆర్థికంగా ఉన్నవారు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలకు ముందుకు రావాల్సిన అవసరం ఉందని డాక్టర్ శంకర్ శర్మ సూచించారు.

మాజీ సిఎంను కలిసిన కంగాటి శ్రీదేవి

ప్రజాశక్తి-పత్తికొండ



కర్నూలులో వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి కుమార్తె రిసెప్షన్ కు బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం జగన్‌మోహన్‌రెడ్డిని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి హానికరం

● మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


ప్లాస్టిక్‌ను సీజ్ చేస్తున్న కమిషనర్

నిషేధిత ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి హానికరమని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో మున్సిపల్ అధికారులు తనిఖీలో భాగంగా అన్నమయ్య సర్కిల్‌లోని టిఫిన్ సెంటర్లను తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు గుర్తించి వారికి జరిమానా విధించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం మానవ మనుగడపై దుష్ప్రభావాలను చూపుతాయని వారు తెలిపారు. ప్రతి వ్యాపార, వాణిజ్య దుకాణదారులందరూ, వినియోగదారులు నిషేధిత ప్లాస్టిక్ వినియోగించడం వల్ల అనేక రకాలైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. రోజువారీ కార్యక్రమంలో భాగంగా ఉదయం నిద్ర లేవడం మొదలుకొని, నిషేధిత ప్లాస్టిక్‌ను ఎక్కడో ఒకచోట, పాల ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్, వాటర్ ప్యాకెట్స్, శుభకార్యాల్లోనూ, హోటల్ నుంచి, రెస్టారెంట్ నుంచి, నిషేధిత ప్లాస్టిక్ కవర్‌లో ఆహారం తీసుకోవడం వల్ల, ప్లాస్టిక్ కవర్లలో టీ, పానీయాలు వినియోగిస్తుండడం వల్ల మానవ ఆరోగ్యంపై తీవ్ర ముప్పు ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిషేధిత ప్లాస్టిక్ వినియోగించకుండా వాటికి ప్రత్యామ్నాయ వస్తువులపై దృష్టి పెట్టి వాటిని వినియోగించాలని వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, పర్యావరణ కార్యదర్శులు గోవిందు, లక్ష్మన్న, శేఖర్ పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్స్ పుస్తకాలు అందజేత


టెస్ట్ పేపర్లను విడుదల చేస్తున్న ఎంఇఒ, యుటిఎఫ్ నాయకులు


ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని విద్యా వనరుల కేంద్రం వద్ద పదో తరగతి విద్యార్థుల కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన మోడల్ టెస్ట్ పేపర్స్ పుస్తకాలను ఎంఇఒ-1, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మల బాబు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.మద్దిలేటి, యు.చంద్రపాల్ బుధవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సులభంగా ప్రిపేర్ అయి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో టెస్ట్ పేపర్స్ పుస్తకాలను రూపొందించినట్లు తెలిపారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థులకు 300 మందికి ఈ పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. ఈ పుస్తకాలను చదివి విద్యార్థులు మంచి మార్కులతో పదో తరగతిలో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ఎంఇఒ-2 నీలకంఠ మాట్లాడుతూ... యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఇలాంటి పుస్తకాలను రూపొందించి ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం గుమ్మల బాబు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. యుటిఎఫ్ నాయకులు మహ్మద్ సలీం, నాగేశ్వర రావు, కెసి.నాగరాజు, లక్ష్మణ్, సుంకన్న పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పాటుపడాలి

● టిడిపి సీనియర్ నాయకులు చెన్నబసప్ప, మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం


నాయకులను సన్మానిస్తున్న టిప్పు సుల్తాన్

సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ-2 అధ్యక్షులుగా ఎన్నికైన టిప్పు సుల్తాన్ రైతుల సంక్షేమం కోసం పాటుపడాలని సీనియర్ నాయకులు చెన్న బసప్ప, మోహన్ రెడ్డి కోరారు. బుధవారం టిప్పు సుల్తాన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తుంగభద్ర దిగువ కాలువ కింద రైతులకు చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా కృషి చేయాలన్నారు. టిడిపి నాయకులు కొట్రేష్ గౌడ్, రఘురామ్, సోమన్న, రహిమాన్, వెంకట్ రెడ్డి, రాజబాబు పాల్గొన్నారు.

కౌన్సిల్ రసాభాస...

● రూ.81.28 కోట్లతో మున్సిపల్ అంచనా బడ్జెట్
● రూ.10 కోట్ల మేర తగ్గిన ఆదోని ఆదాయం
● ఎమ్మెల్యే వర్సెస్ మున్సిపల్ వైస్ ఛైర్మన్

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభసగా సాగింది. ఎమ్మెల్యే వర్సెస్ వైసిపి కౌన్సిలర్లు అన్న రీతిలో వాదోపవాదాలు సాగాయి. ఆదోని అభివృద్ధికి నిధులు వస్తున్నాయని, వైసిపి కౌన్సిలర్లు మెజార్టీ ఉండడం వల్ల అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే పార్థసారథి అనడంతో మూకుమ్మడిగా కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచి ఆరు నెలలు గడుస్తున్నా రూ.కోటి తప్ప ఏ నిధులు తెచ్చారో చెప్పాలని వైస్ ఛైర్మన్ నరసింహులు ప్రశ్నించారు. ప్రత్యేకంగా నిధులు తీసుకురాకుండా తమపై విమర్శలు చేయడం తగదంటూ నిలదీశారు. వైస్ ఛైర్మన్లకు కుర్చీలు ప్రత్యేకంగా వేయాలని లేదని ఎమ్మెల్యే అనడంతో.. ఎమ్మెల్యే గౌరవ సభ్యులు మాత్రమేనని, ప్రత్యేకంగా కుర్చీ వేయాల్సిన అవసరం లేదని వైస్ ఛైర్మన్ నరసింహులు అనడంతో దుమారం లేచింది. ఎమ్మెల్యే పార్థసారథి లేచి వరుస క్రమంలో కూర్చోవడంతో సమస్య సద్దుమణిగింది. అంతకుముందు వైసిపి కౌన్సిలర్లు హాలులో కింద కూర్చొని.. ఇలాగే సమావేశం నిర్వహిస్తామని భీష్మించారు. అంతలో ఎమ్మెల్యే కలుగజేసుకోవడంతో కుర్చీల వ్యవహారం ఓ కొలిక్కి వచ్చింది. యథావిధిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సాగింది.


కౌన్సిల్‌లో వాదోపవాదాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే, కౌన్సిలర్

రూ.81.28 కోట్లతో మున్సిపల్ అంచనా బడ్జెట్

ఆదోని మున్సిపల్ 2025-2026 ఏడాదిలకు గాను రూ.81.28 కోట్లతో అంచనా బడ్జెట్‌ను మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ప్రవేశపెట్టారు. బుధవారం జరిగిన కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ అధికారి బడ్జెట్ అంచనా వివరాలను, ఖర్చులను, రాబడులను పూర్తిస్థాయిలో వివరించారు. గతేడాది మొత్తం రాబడి ప్రారంభ నిర్వచనం కలిపితే రూ.9,186.67 కోట్లు కాగా ఈఏడాది మొత్తం రాబడిని ప్రారంభ నిల్వతో రూ.8,127.90 కోట్లు. గతేడాది కంటే ఈ ఏడాది సుమారు రూ.10 కోట్ల ఆదాయం తగ్గినట్లు అధికారులు సమావేశంలో వెల్లడించారు. వైస్ ఛైర్మన్ మహ్మద్ గౌస్, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, చలపతి, అశోక్, రాజేశ్వర్ రెడ్డి, ఉస్మాన్, బాలాజీ, లోకేశ్వరి, లలితమ్మ, మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్, చలపతి రెడ్డి, గోపీనాథ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, రెవెన్యూ ఆఫీసర్ నాసిర్ హుస్సేన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణ సింగ్ ఉన్నారు.

ఎమ్మెల్యేను ఏకిపారేసిన మహిళా కౌన్సిలర్

రాజకీయంగా ఎదుగుతున్న తన భర్త రమేష్ యాదవ్‌పై కక్ష సాధింపు ధోరణి అవలంభించడం ఎమ్మెల్యే పార్థసారథికి తగదంటూ కౌన్సిలర్ పద్మావతి ఫైర్ అయ్యారు. సకాలంలో ఆస్తి పన్ను చెల్లించకుండా మున్సిపాలిటీ ఆదయానికి వైసిపి కౌన్సిలర్లు గండి కొడుతున్నారని సమావేశంలో వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లను ఉద్దేశించి ఎమ్మెల్యే పార్థసారథి అంతకుముందు సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన రమేష్ యాదవ్ సుమారు రూ.2 లక్షలు పన్ను చెల్లించకుండా ఎగ్గొడుతున్నారని, అలాంటి వ్యక్తులు రాజకీయాలు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలోనే స్పందించిన కౌన్సిలర్ పద్మావతి మాట్లాడుతూ... ఆధార్ మార్ఫింగ్ చేసి భూ కబ్జాకు పాల్పడిన ఘటనలో ఎమ్మెల్యే అనుచరులపై తన భర్త రమేష్ యాదవ్ రాజకీయంగా విమర్శ చేశారన్నారు. దీనిని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే, అతని అనుచరులను తమ నర్సింగ్ హోమ్‌కు పంపి హల్ చల్ చేసి భయపెట్టే ప్రయత్నం చేశారన్నారు. రాజకీయంగా మాట్లాడాలి తప్ప వ్యక్తిగతంగా దాడులకు పురమాయించే పద్ధతి మంచిది కాదని ఎమ్మెల్యేను నిలదీశారు. అదోని ఎమ్మెల్యే టికెట్ వ్యవహారంలో బిజెపి నాయకులు రూ.3 కోట్ల బేరం వ్యవహారం ఆడియో అప్పట్లో బయటకు వచ్చిందని, అలాంటి దానిపై నిగ్గు తేల్చాల్సిన అవసరం ఎమ్మెల్యేకు లేదా అంటూ నిలదీశారు. ఆమె మాట్లాడుతున్నంత సేపు ఎమ్మెల్యే పార్థసారథి సమావేశంలో నేలచూపులు చూడాల్సి వచ్చింది.


మాట్లాడుతున్న కౌన్సిలర్ పద్మావతి

ఒంటి కాలుపై నిలబడి నిరసన

ప్రజాశక్తి - ఆదోని

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ ఒంటి కాలుపై నిలబడి నిరసన చేపట్టారు. ఆదోనిలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ నిరసన బుధవారం 10వ రోజుకు చేరింది. ఆదోనిలోని మున్సిపల్ రోడ్డులో ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జనరల్ సెక్రటరీ అహ్మద్ హుస్సేన్ మాట్లాడారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. పది రోజులుగా నిరసన చేపడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. చర్చలు జరిపి న్యాయం చేయాలని కోరారు. భాస్కర్, శ్రీనివాసులు, శివ, గోవిందు, జెసిబి తిమ్మప్ప, కైలాస్, కెపి.చంద్ర, శంకర్, బసవ, కుమార్, సాయి, పాండు, మారెప్ప, ప్రవీణ్, ప్రకాష్, కుమార్, వినయ్, వై.రామాంజి ఉన్నారు.


నిరసన చేపడుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్

సిసి రోడ్డు నిర్మాణానికి అడ్డంగా ఉన్న రచ్చకట్టల తొలగింపు

- పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో పశు వైద్య కార్యాలయం ఉన్న వీధిలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు అడ్డంగా ఉన్న రచ్చ కట్టలు, బాత్‌రూములు తొలగించామని పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్ తెలిపారు. బుధవారం సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రెయినేజీ కాలువలకు అడ్డంగా ఉన్న వాటిని తొలగించుకోవాలని సంబంధిత కాలనీవాసులకు తెలిపామని అన్నారు. పనులను దగ్గరుండి చూసుకుంటున్నామని తెలిపారు. ఏ అవంతరాలు వచ్చినా సర్ది చెబుతూ సిసి రోడ్డు నిర్మాణం సాఫీగా పూర్తయ్యేటట్లు చూసుకుంటున్నామన్నారు. ఇంజనీర్ అసిస్టెంట్ పావని, నాయకులు పురుషోత్తం, లింగన్న, సుంకన్న పాల్గొన్నారు.


సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్, నాయకులు

ఇంధన పొదుపుతో భవిష్యత్తుకు రక్షణ

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

ఇంధనాన్ని పొదుపు చేసుకుంటూ భావితరాల భవిష్యత్తును రక్షించుకుందామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. బుధవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఆదోని మున్సిపల్ మైదానం నుంచి అవగాహన ర్యాలీని ప్రారంభించి.. మాట్లాడారు. విద్యుత్‌ను ఆదా చేసుకుంటూ బిల్లు తగ్గించుకునే అవకాశాన్ని ప్రతి వినియోగదారుడూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసమే ఈ ర్యాలీ చేపడుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో పేదలపై ఆరుసార్లు విద్యుత్ బిల్లు పెంచితే, కూటమి ప్రభుత్వంలో మాత్రం విద్యుత్ బిల్లును ఏ విధంగా ఆదా చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సౌర విద్యుత్‌ను వినియోగించుకుంటే పర్యావరణ కాలుష్యాన్ని కూడా తగ్గించిన వారమవుతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ సబ్సిడీకి సంబంధించిన సౌర విద్యుత్‌ను వినియోగించుకోవాలని కోరారు. మున్సిపల్ ఛైర్మన్ శాంత, డిఇ హరి, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, అడిషనల్ డిప్యూటీ ఇంజినీర్ పురుషోత్తం, చెన్నయ్య, ఉలిగప్ప పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- కోడుమూరు తహశీల్దార్ వెంకటేష్ నాయక్

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

కోడుమూరు మండలం అమడగుంట్ల గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సును తహశీల్దార్ వెంకటేష్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించారు. ఈ సదస్సులో ఆరు దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వరలక్ష్మి, సర్వే డిటి కృష్ణమూర్తి, ఎడిసాలు రెడ్డి, అమడగుంట్ల విఆర్ఒ మధుసూదన్, అమడగుంట్ల పిఎస్ శంకరమ్మ, రెవిన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

-ఎఒ రవి ప్రకాష్

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు మండలంలోని మన గ్రోమోర్ సెంటర్‌ను మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ తనిఖీ చేశారు. మూడు రసాయన ఎరువుల నమూనాలను అమరావతి ల్యాబ్‌కు నాణ్యత ప్రమాణాలను పరిశీలించుటకు పంపారు. ఈ కార్యక్రమంలో మన గ్రోమోర్ సెంటర్ మేనేజర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు. రైతులకు ఇచ్చే రేట్లను వాకబు చేశారు. మండలంలోని డీలర్స్ అందరికీ, రైతులకు సరైన ధరలకు మాత్రమే విక్రయించాలని, లేనియెడల చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టెంకాయల వేలంపాట

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో లక్ష్మీ మాధవస్వామి ఆలయంలో జనవరి 25 నుంచి టెంకాయలు విక్రయించుకునే హక్కు కోసం బుధవారం వేలంపాట నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించే టెంకాయల వేలంపాట హక్కును మద్దిలేటిరెడ్డి రూ.7.10 లక్షలకు దక్కించుకున్నారు. గత సంవత్సరం కూడా వేలంపాట హక్కులను ఈయనే దక్కించుకోవడం విశేషం. గత ఏడాది కంటే అధికంగా రూ.4.4 లక్షలు సమకూరుంది. ఈ కార్యక్రమంలో కర్నూలు దేవాదాయ శాఖ అధికారి రమేష్ ,సర్పంచి బాలకృష్ణ, మాజీ ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ఇఒ గురు రెడ్డి, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

- నోడల్ అధికారి విజయ్ కుమార్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

తరతరాలుగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని మండల నోడల్ అధికారి విజయ్ కుమార్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం దౌల్తాపురం గ్రామంలో రెవెన్యూ కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. స్వాధీనంలో ఉన్న పొలాలకు సర్వేనెంబర్ వేర్వేరుగా ఉన్నాయని, అడంగల్ వన్ బి రావడం లేదని 10 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తులు పరిశీలించి వెంటనే పరిష్కారం చూపుతామని దరఖాస్తుదారులకు అధికారులు తెలిపారు. టిడిపి నాయకులు మేకల రామాంజనేయులు, హరినాథ్, మాజీ ఎంపిటిసి సంజీవ రాయుడు, మండల సర్వేయర్ నారాయణ, ఆర్ఐ సునీత, విఆర్ఒ వన్నూరు పాల్గొన్నారు. **హోళగుంద** మండలం గజ్జెహళ్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ సతీష్ మాట్లాడుతూ... సరైన పత్రాలు ఉంటే మిగులు భూ సమస్యలు కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సర్పంచి తనయుడు గిరిమల్లప్ప, పంచాయతీ కార్యదర్శి రంగస్వామి పాల్గొన్నారు.


దౌల్తాపురం (చిప్పగిరి) రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు


హోళగుంద రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని గజ్జెహళ్లి గ్రామంలో శ్రీఆంజనేయ స్వామి జీర్ణోద్ధరణ, కొత్తగా నిర్మించే దేవాలయ నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. గజ్జెహళ్లి తిమ్మారెడ్డి, గజ్జెహళ్లి హనుమంతు రెడ్డి, గజ్జెహళ్లి విరుపాక్షి రెడ్డి, గజ్జెహళ్లి తిమ్మారెడ్డి సతీమణి సావిత్రమ్మ, శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పురోహితులు జెకె.నర్సింగాచార్, జెకె.రాజీవ్ ఆచార్ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య గణపతి పూజ, గోపూజ, గో ప్రదక్షణ, హోమం నిర్వహించి భూమి పూజ చేశారు. ఆంజనేయ ఆలయం పైకప్పు గోడను గడ్డపారతో తిమ్మారెడ్డి, సావిత్రమ్మలు కూల్చి మట్టిని ఎత్తివేశారు. ఈ సందర్భంగా గజ్జెహళ్లి సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు, వంశపారంపర్య ధర్మకర్త గజ్జెహళ్లి హనుమంతు రెడ్డి మాట్లాడారు. ఆంజనేయస్వామి ఆలయం నిర్మించి వందేళ్లు అయిందని, దాని ఆలన పాలన తామె చూస్తున్నామని తెలిపారు. స్వామివారికి ప్రతినెలా నూనె డబ్బా సరఫరా చేస్తున్నామని చెప్పారు. కెరే హనుమప్ప ఆలయాన్ని రూ.3 లక్షలతో ఆలయంలో సిసి వేశామని, కొత్త గేటు నిర్మించామని, ప్రహరీ కట్టించామని తెలిపారు. శ్రీపోతులింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేశామని, శ్రీఆంజనేయ స్వామి ఆలయ నూతన శిలా కట్టడాన్ని తాము సొంత ఖర్చులతో, అందరి మద్దతుతో రెండోసారి ఆలయాన్ని కట్టిస్తున్నామని చెప్పారు. భక్తులు శివరామరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, కృష్ణ సాగర్ రెడ్డి, రామ్ సాగర్ రెడ్డి, వరలక్ష్మి రెడ్డి, ఎం.హనుమంతు రెడ్డి, వెంకన్న గౌడ్, పూజారి రామ, సోమి, కాళ్లప్పచారి, రామలింగ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న పురోహితులు

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

- డాక్టర్ శ్రీకాంత్

ప్రజాశక్తి - ఆలూరు

ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఆర్డిప్ సంస్థ వారు ఆలూరు పాత బస్టాండ్ ఆవరణలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన స్టాల్‌ను డాక్టర్ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హెచ్ఐవి అనేది అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని తెలిపారు. ఈ వ్యాధి ఎలా సంక్రమిస్తుంది, దాని నియంత్రణకు మార్గం ఏమిటి అనేదానిపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆర్డిప్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ మాలిక్ మాట్లాడారు. హెచ్ఐవి రోగుల పట్ల వివక్ష చూపరాదని, వీరికి మందులు అందించి ఆత్మస్థైర్యం నింపి కుటుంబాలకు తగిన సహాయం చేయాలని తెలిపారు. అనంతరం స్థానికులతో కలిసి ఎయిడ్స్‌పై ప్రతిజ్ఞ చేశారు. ఆర్డిప్ సిబ్బంది అనిత, రంగన్న, సావిత్రి, ఎర్రిస్వామి, వెంకటేష్, త్రివేణి పాల్గొన్నారు.


స్టాల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీకాంత్


ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

టిడిపి వీరంపల్లి నాయకుడు మృతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వీరంపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బోయ శ్రీను అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు గ్రామానికి చేరుకొని శ్రీను మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే అంతిమ సంస్కార నిమిత్తమై ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి పంపిన రూ.22 వేల నగదును వారు శ్రీను కుటుంబ సభ్యులకు అందజేశారు. టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, తిరుపతయ్య నాయుడు, కైరవాడి తిమ్మారెడ్డి, ఎర్రబాడు శ్రీను, కున్నూరు రమణ, ఐరన్ బండ ముల్లా బాష, రాంపురం రఫీ, తిప్పనూరు రామకృష్ణ, నూర్ అహ్మద్, రామకృష్ణ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు


కుంభాలతో వస్తున్న మహిళలు

ఘనంగా మారికాంబ దేవి దేవర ఉత్సవాలు

ప్రజాశక్తి - కౌతాళం



మారికాంబ దేవి దేవర ఉత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని గోతుల దొడ్డి, చిరుతపల్లి, మధిర, పొదలకుంట, రౌడూరు గ్రామాల్లో ఉత్సవాలు వైభవంగా సాగాయి. మహిళలు కుంభాలతో ఊరేగింపుగా వచ్చి గ్రామ దేవతలకు పూజలు చేశారు. గ్రామంలో బంధువుల సందడి నెలకొంది. ఉత్సవాల ఏర్పాట్లు.. వివిధ పార్టీల నాయకుల స్వాగతాలు అంబరాన్నంటాయి.

నాయకుల సందడి : ఈ గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకుల సందడి నెలకొంది. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, సీనియర్ నాయకులు చెన్న బసప్ప, శివ మోహన్ రెడ్డి, కొట్రేష్ గౌడ్, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, దాట్ల సుబ్బరాజు, ఏకం రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు ఉల్లిగయ్య తదితరులు వేర్వేరుగా వెళ్లి గ్రామ దేవతకు పూజలు చేసి, దర్శించుకున్నారు. వీరికి ఆయా గ్రామాల ప్రజలు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.


టిడిపి నాయకులకు ఘన స్వాగతం